జెండాను ఎగురవేసి బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న షమీమ్ షఫీ ఉల్లా

- అట్టహాసంగా 'అనంత బాలోత్సవాలు-4' ప్రారంభం
- సందడి చేసిన పిల్లలు
- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన సైన్స్ నమూనాలు
- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కిటకిటలాడిన ఆర్ట్స్ కళాశాల మైదానం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడే..సందడి..!

భళా..బాలోత్సవం..!

విజేతలకు బహుమతి అందిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

అంకెల సంఖ్యల మధ్య నలిగిపోయిన బాల్యానికి ఆటవిడుపు దొరికింది... మార్కుల వేటలో బందీ అయిన మెదడుకు కాస్త ఉపశమనం లభించింది... పుస్తకాల మధ్య ఇరుక్కుపోయిన సృజనాత్మకత బయటకు వచ్చింది... నాలుగుగోడల మధ్య నిలిచిన బాల్యపు మధురిమ ప్రపంచానికి తెలిసింది... ఆటపాటలు, నృత్యరూపాలు, కళానైపుణ్యాలు, అద్భుతమైన తెలివితేటల నడుమ చిన్నారులు చేసిన సందడితో అనంత బాలోత్సవ ప్రాంగణం మురిసిపోయింది..!

కళాత్మక ప్రదర్శనలతో కనులవిందు చేశారు. సైన్సు ప్రదర్శనలతో అందరినీ ఆలోచింపజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో అబ్బురపరిచారు. వందలాది మంది చిన్నారులు ఒక్క చోట చేరి అనంత పండుగను కనులు ముందు సాక్షాత్కరింపజేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం వేదికగా జరుగుతున్న అనంత బాలోత్సవాలు-4 సోమవారం నాడు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పిల్లల పండుగలో మొదటి రోజు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు, చిన్నారులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు.

ప్రదర్శన ఇస్తున్న బాలికలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవం-4 పిల్లల పండుగ అనంతపురం నగరంలో సోమవారం నాడు ప్రారంభమైంది. ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో భారతరత్న, మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు ప్రాంగణంలో ఆరు స్టేజ్‌ల్లో కల్చరల్ ఈవెంట్స్‌లో చిన్నారులు వారి ప్రదర్శనలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో అకడమిక్ విభాగంలో వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీలు జరిగాయి. మొదటి రోజు పిల్లలు ఆటపాటలతో చిందులేయడమే కాకుండా, తమ విజ్ఞానాన్ని ప్రదర్శించే పోటీల్లో పాల్గొన్నారు. రంగురంగుల దుస్తులతో విద్యార్థులు విచిత్ర వేషధారణ కన్పించారు. జానపద పాటలు పాడారు. అల్లూరు సీతారామరాజు, రాణి రుద్రమదేవి, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్ తది తర వేషధారణతో నటనా ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. ఇలా ఒకటేమిటి వందలాది వేషధారణలో చిన్నారులు ప్రదర్శనలు చేశారు. తమపిల్లల ప్రతిభా పాటావాలను చూసి మురిసిపోయే తల్లులు కొందరు ఆవరణంలో కనిపించగా, తమ పాఠశాల విద్యార్థి మెరుగైన ప్రదర్శన చేయాలని మరికొంత మంది ఉపాధ్యాయులు ఆరాటపడటం అక్కడ కనువిందు చేసిందనే చెప్పాలి. ఆర్ట్స్ కళాశాల మైదానం మొత్తం పిల్లల పండుగతో కళకళలాడింది.

ఉత్సాహభరితం..

బాలోత్సవంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వందకుపైగా పాఠశాలల నుంచి విద్యార్థులు 2000 మంది వరకు పాల్గొన్నారు. రెండు విభాగాల్లో ఆకడమిక్, కల్చరల్ పోటీల్లో పిల్లలు పాల్గొన్నారు. 64 ఈవెట్స్‌లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. ఒకవైపు అడకమిక్,

కుమారునికి అల్లూరి సీతారామ రాజు వేషధారణ వేయించి బాలోత్సవ ంకు తీసకున్న వస్తున్న చిన్నారి తల్లి

మరోవైపు కల్చరల్ పోటీలు మొదటి రోజు జరిగాయి. అడకమిక్ పోటీలకు విద్యార్థులు అధికంగా మొదటి రోజు పోటీపడ్డారు. చిత్రలేఖనం, కార్టూన్, వ్యాసరచన, కథారచన, దినపత్రిక పఠనం, మెమోరీ టెస్టు, స్పెల్ బి, బేస్ట్ ఫ్రంవేస్టు, సైన్సు

రైతు వేషధారణలో చిన్నారి

ఎగ్జిబిషన్‌లో అడమిక్ పోటీలు ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. కల్చరల్ ఈవెంట్స్‌లో జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలాపన, లఘునాటికలు, జానపద గీతాలాపన, విచిత్ర వేషధారణ ప్యాన్సీ డ్రెస్‌లు పోటీలు విద్యార్థులు పోటాపోటీగా సాగాయి. మొదటి రోజు పోటీల్లో విజేతలకు సాయంత్రం వేదిక వద్దనే బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు.

శాస్త్రీయ ఆలోచనల వైపు అడుగేద్దాం..

బాలోత్సవ ప్రారంభ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లా, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాల్యం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్, బాలోత్సవ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు, అనంత బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన, ఎల్‌కెపి అధ్యక్షులు ప్రభాకర్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు సేకన్న, రచయిత నబీరసూల్ తదితరులు హాజరై వేడుకను ప్రారంభించారు. అంతుకు మునుపు బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అనంత బాలోత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయన్నారు. చదువులు, ర్యాంకుల వేటలో బందీ అవుతున్న పిల్లలకు ఇలాంటి కార్యక్రమాలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. పిల్లలు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. పిల్లలు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. శాస్త్రీయమైన భారతదేశాన్ని స్థాపించుకోవడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, రవికాంత్ రమణ, అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు లింగమయ్య, గోవిందరాజులు, కోటేశ్వరప్ప, నాగేంద్ర, రామాంజినమ్మ, రాజేశ్వరి, శ్యామల, అరుణమ్మ, పాల్గొన్నారు.

బాలోత్సవం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న షమీమ్ షఫీఉల్లా...

పెళ్లి వేడుకలో విషాదం

లారీ బొలేరో ఢీ - ముగ్గురు మృతి

బొలేరో క్యాబిన్‌లో పడి ఉన్న మృతులు

ఎంతో సంతోషంగా పెళ్లివేడుకలో పాల్గొనేందుకు వెళ్లిన వారిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. వివాహ రిసెప్షన్ ముగించుకుని వస్తున్న వారి వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే ముగ్గురు మరణించారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారంతా ఒకే గ్రామం, బంధువులు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా అగళి మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదం పలుకుటుంబాల్లో చీకట్లను నింపింది.

వార్త మెయిన్‌లో

ముందుచూపులేకనే అనంతలో మంచినీటి సమస్య

ఖాళీ కుండలు పగులగొట్టి సిపిఎం నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

గత పది రోజులుగా అనంతపురం నగరంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, దీనిపై పాలకవర్గం, అధికారులకు ముందు చూపులేకనే ఈ సమస్య జఠిలం అయ్యిందని సిపిఎం నాయకులు తెలియజేశారు. నగరంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలు, కడవలు పగులగొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ గత పది రోజుల నుంచి అనంతపురం నగరంలో మంచినీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. నీళ్లులేక నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరానికి నీటి సరఫరా చేసే కొర్రకోడు డ్యాం వద్ద నీటి పంపింగ్ మోటార్లు పాడైపోయి ఆరు నెలలు గడుస్తున్నా వాటిని మరమ్మతు చేయించకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. మోటార్ల మరమ్మతులను పట్టించుకోని డిఇ చంద్రశేఖర్, ఇతర అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా కొంతకాలం మంచినీటి సమస్య తప్పదంటూ అధికారులు, పాలకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దాహం వేసినప్పుడు బావి తవ్వే విధంగా అనంతపురం కార్పొరేషన్ అధికారుల తీరు ఉందన్నారు. గతంలో మున్సిపల్ కార్మికుల సమ్మె చేస్తుంటే చెత్తను తొలగించడానికి పాలకులు, అధికారులు ప్రయివేటు ట్రాక్టర్లు, జెసిబిలను ఆఘమేఘాలపై తెప్పించారని, ఇప్పుడు నీటి సమస్య పరిష్కారానికి అవసరమైనన్ని ట్యాంకర్లను ఎందుకు తెప్పించ లేదని ప్రశ్నించారు. భవిష్యత్తులోనూ నగరానికి ఎలాంటి నీటి సమస్య లేకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముష్కిన్, ప్రకాష్, వలీ, జీవ, ఎన్టీఆర్ శీన, రాజు, నూరుల్లా, ఫక్రూ, మోహన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఖాళీ కుండలతో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు, నగరవాసులు

"కాపు" స్విచ్ఛాఫ్..!

రాజకీయాల్లో కొనసాగుతున్నా అనేక ఊహాగానాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎవరికీ అందబాటులో లేకుండా ఉండటం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశం అవుతోంది. ఆయనకు వైసిపి పెద్దల నుంచి వెల్‌కమ్ లభించిందన్న ప్రచారమూ నడుస్తోంది. అయితే దీనిపై స్పష్టమైన నిర్ధారణేది లేనప్పటికీ ఆయన మొబైల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి స్థానిక నేతలకు కూడా దూరంగా ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇటీవలే ఆయన వైసిపి నుంచి బయటకు వస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. రాయదుర్గం అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా మెట్టు గోవిందరెడ్డిని ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్థానిక వైసిపి నాయకులు ఆయనకు మధ్య కూడా దూరం పెరిగింది. మున్సిపల్ సమావేశంలోనూ ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యే కానట్టుగానే వైసిపి ఛైర్మన్ మొదలుకుని కౌన్సిలర్లు కొంత మంది వ్యవహరించారు. దీంతో ఆయన కాంగ్రెసు పార్టీలో చేరుతారన్న ప్రచరాం జోరుగా సాగుతూ వస్తోంది. ఎఐసిసి సభ్యులైన రఘువీరారెడ్డిని ఆయన నివాసానికి కుటుంబ సమావేతంగా వెళ్లి కాపు రామచంద్రారెడ్డి కలసొచ్చారు. ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల ఇటీవల అనంతపురం జిల్లా పర్యటనలోనే చేరుతారని ప్రచారం జరిగినప్పటికీ ఆయన చేరిక జరగలేదు. రాబోయే రోజుల్లో చేరే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఆయనకు తిరిగి వైసిపి పెద్దల నుంచి పిలుపు వచ్చిందన్న ప్రచారం రెండు రోజులుగా జోరుగా సాగుతోంది. అయితే దీనిపై ఆయన మాత్రం ఎక్కడా బయటకు విషయం వెల్లడించలేదు. ఈ పరిస్థితుల్లో ఆయన అందుబాటులో లేకుండా ఉండటం వెనుక బలమైన రాజకీయ కారణం ఏదైనా ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. అధిష్టానం అంటే ముఖ్యమంత్రి స్థాయి నుంచి వచ్చిందా.. లేక ఇతర నాయకుల నుంచి ఈ ప్రయత్నం జరిగిందా అన్న దానిపై స్పష్టత లేదు. వైసిపి నుంచి బయటకు వస్తున్నా అన్న సమయంలో ముఖ్యమంత్రిని కలువడానికి ప్రయత్నించినా అవకాశం లేకపోవడంతోనే బయటకు వస్తున్నా అంటూ తాడేపల్లికి గుడ్‌బై చెప్పి వచ్చారు. వైసిపి ఆవిర్భావం నుంచి జగన్మోహన్‌రెడ్డి వెంట నడిస్తే తనకు గుర్తింపు లేకుండాపోయిందని ఆయన తన మద్దతుదారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కాపునకు మంత్రి పదవుల్లో స్థానం లభిస్తుందని ఆశించినా అలాంటిదేమీ జరగలేదు. ఇప్పుడు జరగబొయే సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా టిక్కెట్టు కూడా లేదనే సరికి వైసిపికి గుడ్‌బై చెబుతున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు తిరిగి పిలుపొస్తే ఏమి చేస్తారన్న చర్చ నడుస్తోంది. అధిష్టానం నుంచి పిలుపొచ్చి సర్ధిజెప్పే ప్రయత్నం చేస్తే ఒప్పుకుంటారా లేదా అన్నది రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఆయన బయటకొచ్చి ఏదైనా ప్రకటన చేస్తే తప్ప ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నేడు కణేకల్‌లో జరిగే ఓ కార్యక్రమంలో కాపు పాల్గొనే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అక్కడైనా దీనిపై ఒక క్లారిటీని ఇస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

అంతర్‌రాష్ట్ర 'పార్థీ గ్యాంగ్' అరెస్టు

రూ.3.50 లక్షలు, 2 లారీలు స్వాధీనం

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో పలు రాబరీలు, కేసులు ఉన్న అంతర్రాష్ట్ర పార్థీగ్యాంగ్‌ను అనంత పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాకు చెందిన శివప్ప పవర్, బాలాజీ దత్తాత్రినాయక్, బాబానందు షిండే, మాదేవ్ సురేష్ పవార్, అశోక్ ధర్మ జాదేవ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరితోపాటు రిసీవర్లు అయిన జిల్లాలోని యాడికి మండలం వేములపాడుకు చెందిన గడ్డం గాంగేశ్వర, గడ్డం నాగేష్, కడవకల్లు జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. నిందితుల నుంచి రూ.3.5 లక్షల నగదు, 2 లారీలు, 2 చేతిపంపులు, 100 మీటర్ల పైపు, 50 ఖాళీ డీజిల్ క్యాన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠాలోని సభ్యులందరూ బంధువులే అన్నారు. శివారు ప్రాంతాల్లోని పెట్రోలు బంకులనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలు చేస్తుంటారన్నారు. మహారాష్ట్ర ప్రాంతంలో రెండు 12 వీలర్ల లారీలను అద్దెకు తీసుకుని శివారు ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి దాటాక లారీలను బంకులకు 200 మీటర్ల దూరంలో నిలిపి పెట్రోల్ ట్యాంకుకు రంధ్రం వేసి తమ వద్ద ఉన్న పైపుల ద్వారా డీజిల్‌ను దొంగిలిస్తారన్నారు. బంకు సిబ్బంది మేల్కొన్నట్లైతే వారిని చంపుతామని బెదిరించి, వారి నుంచి నగదును దోచుకెళ్లేవారన్నారు. ఈ విధంగా రాప్తాడు శివారులోని పెట్రోల్ బంకులో రూ.28 వేలు, కూడేరు పెట్రోల్ బంకులో రూ.28 వేలు, సత్యసాయి జిల్లాలోని బత్తలపల్లి పెట్రోల్ బంకులో 1924 లీటర్ల డీజిల్, చెన్నేకొత్తపల్లి శివారు పెట్రోల్ బంకులో 1631 లీటర్ల డీజిల్, అన్నమయ్య జిల్లాలోని గుర్రం కొండ పెట్రోల్ బంకులో 1230 లీటర్ల డీజిల్ చోరీ చేశారన్నారు. ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందాలు రంగంలోకి దిగి పక్కా సమాచారంతో సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జనార్ధన్, సిబ్బంది రంజిత్, బాలకష్ణ, దాస్, అసీఫ్, యాసిర్, మనోహర్‌ను స్థానిక ఎస్కే యూనివర్సిటీ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. మరింత మంది కీలక నిందితులు పట్టుబడాల్సి ఉందన్నారు. ఈమేరకు సీసీఎస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

మండల బిడ్డగా బాధ్యతగా పనిచేశా..

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మీ మండల బిడ్డగా.. ఎమ్మెల్యేగా బాధ్యతగా పని చేశానని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఒడ్డుపల్లి ఎస్సీ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.117 కోట్లు మంజూరు చేయించామన్నారు. పెన్నఅహోబిలం రిజర్వాయర్ నుంచి ఆత్మకూరు మండలం, అనంతపురం రూరల్ మండలం పాపంపేట వరకూ నేరుగా పైపులైన్ నిర్మించి తాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా ఈనెల 18న రాప్తాడులో నిర్వహించే 'సిద్ధం' సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మండల కన్వీనర్, ఎంపిపిలు, అధికారులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

దుస్తుల దుకాణం సీజ్‌ను తొలగించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

కుట్ర పూరితంగా పట్టణంలో సీజ్ చేసిన ఇండియన్ స్టోర్ దుస్తుల దుకాణాన్ని వెంటనే తెరిపించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు దుస్తుల దుకాణానికి సీజ్ చేయడాన్ని నిరసిస్తూ బాధిత వ్యాపారి ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెన్నైకి చెందిన ఓ వ్యాపారి పట్టణంలోని కింది పెట్రోల్ బంక్ వద్ద రూ.కోటి ఖర్చుతో దుస్తుల దుకాణాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ ధరలకు దుస్తులను విక్రయిస్తున్నారన్నారు. దుకాణం ప్రారంభానికి ముందే మున్సిపల్ అనుమతులకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈనేపథ్యంలో తక్కువ ధరకు దుస్తులు విక్రయిస్తుండటంతో కొనుగోలుదారులు అధికమయ్యారన్నారు. ఇది జీర్ణించుకోలేక పట్టణంలోని పెద్ద వ్యాపారులు మున్సిపల్ అధికారులపై రాజకీయ వత్తిళ్లు తెచ్చి దుకాణాన్ని ఉన్నఫళంగా దుకాణాన్ని సీజ్ చేయించారని ఆరోపించారు. అనుమతులు లేకుండా పట్టణంలో అనేక మంది వ్యాపారాలు చేస్తున్నారన్నారు. వాటిని సీజ్ చేయని అధికారులు ఈ దుకాణాన్నే ఎందుకు సీజ్ చేశారని ప్రశ్నించారు. వెంటనే దుకాణానికి సీజ్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

కాపర్‌వైరు చోరీ

దుండగులు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

ఆత్మకూరు : మండల పరిధిలోని మదిగుబ్బ గ్రామానికి చెందిన రైతు కురుబ పుల్లన్న ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి కాపర్‌వైరును చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు పుల్లన్న చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి కాపర్ వైరును చోరీ చేశారు. ఉదయం తోట వద్దకు వచ్చి రైతు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన విషయాన్ని గమనించి వెంటనే విద్యుత్ శాఖ ఏఈతోపాటు ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా దాదాపు 13 ఎకరాల్లో వివిధ రకాలు పంటలు సాగు చేశానని, ఈ సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోతే పంటలు అన్నీ ఎండిపోతాయని బాధిత రైతు వాపోయారు. విద్యుత్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పంటలను కాపాడాలని బాధిత రైతు కోరుతున్నాడు.

నాయీ బ్రాహ్మణులకు తోడ్పాటు

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక నాయీ బ్రాహ్మణుల కుటుంబాలకు మునుపెన్నడూ లేనంతగా తోడ్పాటు అందిస్తున్నారని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎస్‌ఆర్‌ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు జగనన్న ప్రభుత్వం దేశ చరిత్రలోనే అరుదైన గౌరవాన్ని కల్పించిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నాయీ బ్రాహ్మణులకు జగనన్న చేదోడు, షేవింగ్ సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అందజేస్తున్నట్లు వివరించారు. నూతనంగా నియమించిన సమన్వయకర్త ఎం.వీరాంజనేయులును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం 110 మంది నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారులు, నాయీ బ్రాహ్మణులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

బీసీలకు అండగా టిడిపి : మాజీమంత్రి కాలవ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

రాష్ట్రంలో బిసిలకు అండగా నిలిచిన ఏకైక పార్టీ టిడిపి అని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని కాజులూరు గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు అన్నివిధాలుగా పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. దేశంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీ టిడిపి అన్నారు. వైసిపి ప్రభుత్వం బీసీ ఓటర్లతో గద్దెనెక్కి మొండిచేయి చూపించిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి బీసీల సత్తా ఏంటో ఓట్ల రూపంలో చూపించాలని పిలుపునిచ్చారు. కాగా మండలంలోని పాత హడగలి, కొత్త హడగలి గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు సోమవారం టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు మల్లికార్జున, గంగాధర్, నాయకులు సోమలాపురం శంకర్, వన్నూరుస్వామి, శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి శ్రీరాములు, నాగల్లి, పుష్పావతి, ఓబుళాపురం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం : పట్టణంలోని17వ వార్డు గుగ్గిరట్టి వీధికి చెందిన 20 కుటుంబాలు టిడిపి ఇన్‌ఛార్జి కర్రన్న, యువత ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో సోమవారం టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతిపంటకూ నష్టపరిహారం ఇవ్వాలి

పామిడి : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్టపోయిన ప్రతి పంటకూ నష్టపరిహారం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రం లోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడటంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు, విత్తనం వేయలేని రైతులకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. అలాగే పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

Before The Permanent Lokadalat For Public Utility Service, Ananthapuramu

P.L.A.C. No:01/2022

Between:
Canara Bank, Main Branch Ananthapuramu, Rep by its Chif Manager ...petitioner
And
K.Sesha Chalapathi ...Respondant

Notice to Respondant

To:
K.Sesha Chalapathi S/o K.Sethu Rao, R/at D.No:8/241, Singh Veedhi Opp:Prasanth Nursing Home, Court Road, Ananthapuramu

పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 07-03-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

K.RAMESH BABU,
ADVOCATE, ANANTHAPURAMU.

In The Court of The IIIrd Addl. Junior Civil Judge,(Excise Court) Ananthapuramu

O.S. No:1707/2022

Between:
Canara Bank (Rep by its athorized officer, Y.Obula Reddy, Manager, Canara Bank old Town Branch Ananthapuramu, ...Plaintiff
And
M/s K.G.N.Pan Shop & General Store, Rep by its Shaik Hajari Jeelan, Ananthapuramu, ...Defendant

Notice to Defendant

To:
M/s K.G.N.Pan Shop & General Store, Rep by its Shaik Hajari Jeelan S/o Late Shaik Hajari Gouse Moddin, R/at D.No:10-261-B7, Guljarpet, Ananthapuramu

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 15-02-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

K.RAMESH BABU,
ADVOCATE, ANANTHAPURAMU.

In The Court of The Addl. Senior Civil Judge, Ananthapuramu

I.A. No: 124/2023 in O.S. No:90/2015

Between:
State Bank of India Rep by its Chif Manager, Uravakonda Village & Mandal, Ananthapuramu, Dist ...Petitioner/Plaintiff
And
G.Meenakshamma and others ...Respondants/Defendants

Notice to Respondant No:3,4 and 6

R3:G.Ramesh S/o G.Venkataravanappa, R/at Shaikshanipalli Village & Uravakonda Mandal, Ananthapuramu Dist.
R5:G.Venkatamma W/o Sudhakar R/at Dharmavaram Gate, Guntakal,
R6:G.Manohar S/o G.Venkataravanappa, R/at Shaikshanipalli Village & Uravakonda Mandal, Ananthapuramu Dist.

పై నెంబరు కేసులో ఫైనల్ డిక్రీ కొరకు రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తము 28-02-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

చిలమకూరి శ్రీనివాసులు, అడ్వకేట్,
అనంతపురం, సెల్:9490122008

In The Court of The Prl. Senior Civil Judge, Ananthapuramu

I.A. No: 137/2023, I.A. No: 138/2023,
I.A. No: 139/2023 in O.S. No:47/2021

Between:
1.C.Sarala, 2.M.Indira ...Petitioners/Plaintiffs
And
M.Pulla Reddy and others ...Respondants/Defendants

Notice to Respondant No:10,11,13,14 and 15

R10:M.Siva Prasad S/o Late Rudrappa,
R11:M.Nagabhushanam S/o Late Rudrappa,
R13:Saraswathi D/o Late Rudrappa,
R14:Bhuvaneswari D/o Late Rudrappa,
R15:Ganga Lakshmi D/o Late Rudrappa,
All are R/at D.No:4-202, Papampeta, Kalyanadurgam Road, Ananthapuramu Town & Dist.

పై నెంబరు కేసులో రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తము 21-02-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

C.ASHOK KUMAR REDDY,
ADVOCATE, ANANTHAPURAMU.
CELL:9440440962

'అనంత'లో సూర్యానగర్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సూర్యానగర్ రోడ్డును ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ సహకారం, నగర పాలకసంస్థ పాలకవర్గం సమిష్టి కృషితో ఎన్నడూ లేని విధంగా అనంతపురం రూపురేఖలు మార్చామన్నారు. ఇందులో భాగంగా అతి తక్కువ సమయంలో సూర్యా నగర్ రోడ్డు నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కేవలం సూర్యనగర్ రోడ్డు మాత్రమే కాదని, గుత్తి రోడ్డులోని కనకదాస విగ్రహం నుంచి తడకలేరు వరకూ జాతీయ రహదారిని నిర్మించామన్నారు. అలాగే బళ్లారి బైపాస్ నుంచి టవర్ క్లాక్ మీదుగా పంగల్ రోడ్డు వరకూ రహదారి విస్తరణ చేశామన్నారు. అదేవిధంగా రాజు రోడ్డు, శ్రీకంఠం నుంచి గుత్తి రోడ్డు వరకూ, జెఎన్‌టియు రోడ్డు, హౌసింగ్ బోర్డు, జన్మభూమి రోడ్డు, కోవూరు నగర్‌లో రోడ్డు, రామచంద్రనగర్ వంటి ప్రధాన రోడ్ల రూపురేఖలు మార్చామన్నారు. ప్రజల సహకారంతో భవిష్యత్‌లో అనంతపురాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ మేఘస్వరూప్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు తరిమెల అబుసులేహా, బాబా ఫక్రుద్దీన్, సైఫుల్లా బేగ్, బాలాంజినేయులు, సాకే చంద్రలేఖ, రాజేశ్వరి, పలువురు వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సూర్యానగర్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

మాట తప్పి.. మడమ తిప్పిన జగన్

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

ఎన్నికల ముందు 'మాట తప్పను.. మడమ తిప్పను' అంటూ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిన సిఎం జగన్.. మాట తప్పి మడమ తిప్పారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. సోమవారం యల్లనూరు మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేపించుకున్న జగన్ ముఖ్యమంత్రి కాగానే అన్నీ విస్మరించారన్నారు. అంతేగాకుండా పాలనలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ సమయంలో చంద్రబాబుకు ఓటు వేసి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే అన్నివర్గాలతోపాటు రాష్ట్రం అభివృద్ధి సాధ్యమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

కార్యకర్త మృతికి నివాళి

పుట్లూరు : మండల కేంద్రంలో మృతిచెందిన టిడిపి కుటుంబ సభ్యులు వడ్డే సుబ్బరాయుడు మృతిచెందడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ సోమవారం నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, కడవకళ్లు గోవర్ధన్‌రాజు, ఎల్కే చెన్నారెడ్డి, అరగటివేముల రంగయ్య, తాజ్, రామచంద్రనాయుడు, మడ్డిపల్లి శివారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయదుర్గం

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్ సందర్శించారు. తర్వాత మహమ్మదీయ అరబిక్ జూనియర్ కళాశాలను పరిశీలించారు. అంతకుముందు మండల పరిధిలోని వేపరాల వద్ద వేదవతి నదిలో ఇసుక రీచ్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాల వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2213 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నచోట్ల అదనంగా జిల్లాలో 23 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదివరకే ఓటర్ల జాబితా విడుదల చేశామని, కొత్తగా చేర్పులు ఉంటే అదనంగా జాబితా విడుదల చేస్తామన్నారు. జిల్లాలోని ఇవిఎంల పంపిణీ, స్ట్రాంగ్ రూమ్ నిల్వ, ఓట్ల లెక్కింపునకు జెఎన్‌టియు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. అక్కడనుండి నియోజకవర్గం కేంద్రాలకు నిర్ణీత కాలంలో ఇవిఎంలు సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం స్ట్రాంగ్ రూంలో చేర్చుతామన్నారు. అనంతరం మండల కేంద్రం గుమ్మగట్టలోని ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట కళ్యాణదుర్గం ఆర్డీవో రాణీసుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు, రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత ఉన్నారు.



పోలింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

మున్సిపల్ సిబ్బందిని నియమించాలని వినతి

పట్టణానికి అవసరమైన పనులు చేపట్టేందుకు మున్సిపల్ సిబ్బందిని నియమించాలని పట్టణానికి విచ్చేసిన కలెక్టర్ గౌతమిని స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప కలిసి విన్నవించారు. రాయదుర్గం పురపాలక కార్యాలయంలో సెక్షన్ అధికారులు లేక అత్యవసర, అభివృద్ధి పనులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కావున అధికారులు, సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పొరాళుశివ, నిజాముద్దీన్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి అండగా నిలవాలి : మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ : పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సిఎం జగన్‌కు మరోసారి అండగా నిలబడదామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా లింగాల సంగమేశ్వర స్వామి, నాగిరెడ్డిపల్లిలోని కుంటెమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అనంతరం కూడేరు మండల కేంద్రం నుంచి ఇప్పేరు, నాగిరెడ్డిపల్లి మీదుగా మరుట్ల వరకూ రూ.6.40కోట్లతో చేపట్టనున్న తారు రోడ్డు పనులకు ఎంపిపి నారాయణరెడ్డి, జడ్పిటిసి అశ్వినితో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నాయకులు వీరన్న, నారాయణరెడ్డి, కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి అశ్విని, బైరెడ్డి రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపిలు సుబ్బమ్మ, దేవా, ఇప్పేరు రమేష్, దేవేంద్ర, నాయకులు తుప్పటి హరీష్, సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే గ్రామస్వరాజ్యం : ఎంపిపి

బెళుగుప్ప : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎంపిపి ఎంపిపిల జిల్లా సంఘం అధ్యక్షులు సి.పెద్దన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక సమస్యలపై మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటు చేసి అధికారులను గ్రామాలకే తీసుకొచ్చారన్నారు. వీటితోపాటు పలువురు సభ్యులు సమస్యలపై, అధికారులు తమ పరిధిలో చేసిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పృథ్వీసాగర్, ఎంపిటిసి గంగవరం ప్రసాద్, తహశీల్దార్ హరినాథ్‌రావు, ఎంపిడిఒ సుబ్బరాజు, వైస్ ఎంపిపి పుష్పావతి దుద్దేకుంట రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షులు బి.శివలింగప్ప, అధికారులు మాధవరెడ్డి, బాషా, డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, శ్రీరంగాపురం డాక్టర్ రుషికేశ్, పంచాయతీ సెక్రటరీలు వెంకటేశులు, శ్రీరాములు, ఉమా, సర్పంచులు నక్కలపల్లి రామిరెడ్డి, సాలిబాయి, గుండ్లపల్లి పురుషోత్తం, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని వినతి

పామిడి : పామిడి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ పామిడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం కింద దాదాపు 4750 జాబ్ కార్డులు ఉండేవన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ కూలి పనులు చేసుకుని జీవనం కొనసాగించేవారన్నారు. అయితే 2012లో నగర పంచాయతీగా మార్చారన్నారు. అప్పటి నుంచి ఉపాధి పనులను నిలిపివేశారన్నారు. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం గ్రామాల్లో ఉండే వారికి మాత్రమే ఉపాధి పనులు కల్పిస్తారన్నారు. ప్రస్తుతం పామిడిని గ్రామ పంచాయతీగా మార్చిన నేపథ్యంలో తిరిగి కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రహీం, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, సిపిఐ ఎంఎల్ నాయకులు గజ్జల దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం సర్పంచి చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలి

బుక్కరాయసముద్రం : మండల కేంద్రం సర్పంచి చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని ఎస్సీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆందోళనలో వారు మాట్లాడుతూ ఎస్సీ నియోజకవర్గం అని పేరుకు మాత్రమే ఉందన్నారు. పెద్దనం అందా అగ్రవర్ణాల చేతుల్లోనే ఉందన్నారు. ఇందుకు బుక్కరాయసముద్రం సర్పంచి చెక్‌పవర్‌ను తొలగించడమే నిదర్శనమన్నారు. వెంటనే సర్పంచి చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటాపురం చంద్ర, డప్పు కళాకారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముకుందాపురం నాగరాజు, మండల అధ్యక్షుడు రేకలకుంట రామాంజనేయులు, మండల కార్యదర్శి రెడ్డిపల్లి నాగేష్ పాల్గొన్నారు.

బడుగుల గుండెల్లో పరిటాల కుటుంబం

ఆత్మకూరు : బడుగు, బలహీన వర్గాల గుండెల్లో పరిటాల కుటుంబం చిరస్థాయిగా నిలిచే ఉంటుందని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి బికె పార్థసారథి, కాలవ శ్రీనివాసులు, జొన్నా సూర్యనారాయణ, చమన్‌సాబ్ వంటి వారిని అందలం ఎక్కించిన ఘనత పరిటాల రవీంద్రకే దక్కుతుందన్నారు. అంతేగాకుండా రాప్తాడు నియోజకవర్గంలో మండలాలు వారీగా కురుబ, వాల్మీకి, దళితులను ఎంపిపి, జడ్పీటిసిలను చేశారని గుర్తు చేశారు. అయితే చమన్‌సాబ్ మరణానికి పరిటాల కుటుంబం అని తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి మాజీ కన్వీనర్ మనోరంజని,గ్రామ కమిటీ అధ్యక్షులు బొమ్మయ్య, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, అక్కులన్న, నాయకులు వాల్మీకి కందల ఓబులు, వెంకటేశులు, ఓబుళపతి, గోపి, రామదాసు, గాలి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుధ్య మేస్త్రీలుగా కొనసాగించాలని వినతి

అనంతపురం కార్పొరేషన్ : పిహెచ్ వర్కర్లుగా మార్చిన పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న మేస్త్రీలను మేస్త్రీలుగానే కొనసాగించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నగరంలోని కార్యాలయంలో కమిషనర్ మేఘా స్వరూప్‌నకు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మేస్త్రీలుగా చేస్తున్న వారంతా ఉన్నత చదువులు చదువుకున్న వారు అన్నారు. అంతేగాకుండా చాలా సంవత్సరాల నుంచి మేస్త్రీలుగా అనుభవం ఉందన్నారు. వీరందరినీ యథావిధంగా మేస్త్రీలుగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, సిఐటియు నగర అధ్యక్షులు గురురాజా, పర్మినెంట్ ఉద్యోగుల అధ్యక్ష, కార్యదర్శులు నల్లప్ప, ముత్తురాజు, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకురాలు మంత్రి వరలక్ష్మి, మేస్త్రీలు శ్రీనివాసమూర్తి, మహమ్మద్, పెద్దన్న, శివ, హరి, సత్యనారాయణ, నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు బహిరంగ వేలం

కళ్యాణదుర్గం : పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కళ్యాణదుర్గం రూరల్ సిఐ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక కారుకు వేలంపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు డయల్‌యువర్ డిఎం

కళ్యాణదుర్గం : ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిఎం రామచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం సెల్.. 99592 25826 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో బీ.టెక్ 2వ సంవత్సరం 1వ సెమిస్టర్, సప్లిమెంటరీ, 2వ సంవత్సరం 2వ సెమిస్టర్, సప్లిమెంటరీ, 2వ సంవత్సరం 1వ సెమిస్టర్, బీ.టెక్ 2వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆఖరి ఛాన్స్) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

ఎస్పీని కలిసిన ఏఆర్ అదనపు ఎస్పీ

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్‌ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏ.ఆర్ విభాగం అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుమునుపు తన ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, జాఫర్ (రాష్ట్ర సభ్యులు), సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్ మరియు మసూద్ లు ఏ.ఆర్ అదనపు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రంగనాథ స్వామి ఆలయానికి రూ.10 లక్షల ఆదాయం

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి ఆలయానికి రూ.10లక్షలు ఆదాయం లభించింది. ఆలయం వద్ద టెంకాయల విక్రయ హక్కు కోసం సోమవారం ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ కె.రాణి, ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.దేవదాసు సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈనెల 18వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలు సందర్భంగా 9రోజులపాటు టెంకాయలు విక్రయించుకునేందుకు వేలం నిర్వహించగా ప్రొద్దుటూరు చెందిన సరస్వతి రూ.4.22లక్షలకు వేలంపాట దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో తొండపాడు సింగిల్‌విండో అధ్యక్షుడు ఎన్.పురుషోత్తంయాదవ్, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

పామిడి : మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి సహకారంతో ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి బిసిఆర్ దాస్, ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే గోవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం, గరుగుచింతలపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపిడిఒ దస్తగిరి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రంలో ఏర్పాట్లు, వెలుతురు, తాగునీటి సౌకర్యం వంటి ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఇవిఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎడిఎ లక్ష్మానాయక్ అధ్యక్షతన సోమవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ కంది, జొన్న పంటలను ప్రభుత్వ సివిల్ సప్లై ద్వారా రోజువారి ఆధారిత ధర ప్రకారం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.